క్లుప్తంగా

సైబర్ నేరాలపై జాగ్రత్త



సదస్సులో మాట్లాడుతున్న సీఐ

వరంగల్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వరంగల్ సీసీఎస్ సీఐ ఎల్.రమేష్‌కుమార్ అన్నారు. 14వ డివిజన్ సుందరయ్యనగర్ ఏనుమాముల పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రామస్తులకు నేరాలపైన బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, వాటితో అదనపు భద్రత లభిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఏనుమాముల ఎస్సైలు పోగుల శ్రీకాంత్, రాజన్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదాలు జరిగే స్థలాల గుర్తింపు



స్థలాలను పరిశీలిస్తున్న ఏసీపీ శ్రీనివాస్

మడికొండ: మడికొండ పోలీసు స్టేషన్ పరిధిలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలు, హైవే రోడ్డుతో పాటు ఔటర్ రింగ్ రోడ్డును ఇన్‌స్పెక్టర్ వేణుతో కలిసి కాజీపేట ఏసీపీ శ్రీనివాస్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ వేణుకు పలు సూచనలు చేశారు. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సైలు నర్సింహరావు, దివ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మానవీయ విలువలు పెంపొందించుకోవాలి



దుస్తులు పంపిణీ చేస్తున్న దాతలు

హన్మకొండ: ప్రతీఒక్కరు మానవీయ విలువలు మరింతగా పెంపొందించుకుని తోటి వారికి సహాయపడాలని ప్రముఖ యోగా గురువు పోశాల శ్రీనివాస్ సూచించారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ప్రేరణ ఫౌండేషన్, హరిత యోగా సాధకుల సహాయంతో హనుమకొండలోని అంబేడ్కర్‌నగర్‌లోని కుటుంబాలకు బుధవారం దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హరిత యోగా సాధకులు, ప్రేరణ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

హసన్‌పర్తి: ప్రాజెక్ట్ జీఆర్ఎల్ ఉమెన్ ఎంపవర్‌మెంట్ అవేర్‌నెస్‌లో భాగంగా హసన్‌పర్తి మండలం వంగపహాడ్‌లో మహిళలకు బుధవారం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు పలు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ తేజస్విని, పారా మెడికల్ బృంద సభ్యులు ప్రెసిల్లా నిస్సీజవహర్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఆనంద్, స్థానికులు చింత శ్రీనివాస్, పొన్నాల రఘు, పొన్నాల కిరణ్, తెట్టి కుమారస్వామి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రామసురేందర్ సంస్మరణ సభ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

కాశిబుగ్గ: వరంగల్ 35వ డివిజన్ ఏసీరెడ్డినగర్‌లోని సీపీఎం కార్యాలయంలో గురువారం జరగనున్న రామసురేందర్ 22వ సంస్మరణ సభను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు నలిగంటి రత్నమాల పిలుపునిచ్చారు. ఈమేరకు సంస్మరణ సభకు సంబంధించిన కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సభకు సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాములు, సీపీఎం నాయకులు తదితరులు హాజరవుతున్నారని తెలిపారు.

ప్రమాదంలో ఒకరికి గాయాలు

మడికొండ: రోడ్డు ప్రమాదంలో వాహనదారుడికి గాయాలైన సంఘటన మడికొండ చౌరస్తాలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రాంపూర్ గ్రామానికి చెందిన అలకుంట రాజు అనే యువకుడు రాంపూర్ నుంచి ద్విచక్ర వాహనంపై మడికొండ వైపు వస్తూ చౌరస్తాలో యూటర్న్ తీసుకుంటుండగా అదుపుతప్పి కింద పడిపోయాడు. దాంతో తీవ్ర గాయాలైన రాజును స్థానికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

అజాగ్రత్తగా ఉంటే... ఆస్పత్రికే!

అధ్వానంగా సీతంపేట రోడ్డు

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు, ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

హసన్‌పర్తి: సీతంపేట రోడ్డుపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డుపై అజాగ్రత్త వెళ్లే నేరుగా ఆస్పత్రికి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ప్రతీరోజు ప్రమాదాలు జరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కరీంనగర్ జాతీయ రహదారి నుంచి సీతంపేట గ్రామానికి వెళ్లాలంటే అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని చెబుతున్నారు. రెండు కిలోమీటర్ల మేర రోడ్డు అధ్వానంగా మారింది. రోడ్డుపై పలు చోట్ల గుంతలు ఏర్పడ్డాయి. రాత్రి వేళల్లో మాత్రం ఈరోడ్డుపై ప్రయాణం చేయాలంటే సాహసం చేయాల్సిందే.



ధ్వంసమైన సీతంపేట రోడ్డు



ప్రమాదకరంగా రోడ్డుపై మట్టికుప్ప



రోడ్డుపై ఉన్న మట్టి

మడికొండ: మడికొండ – ధర్మసాగర్ రోడ్డులో కపిల్ హోమ్స్ ఎదురుగా కేబుల్ వైర్ల కోసం తీసిన మట్టిని రోడ్డుపై పోశారు. దాంతో అది వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. వీధి లైట్లు లేక రాత్రి సమయంలో రోడ్డు ప్రమాదాలు జరుతున్నాయని స్థానికులు తెలిపారు. మట్టికుప్ప కారణంగా ధర్మసాగర్‌కు చెందిన బ్యాంక్ ఉద్యోగి నారాయణ, మడికొండ గ్రామానికి చెందిన రైల్వే ఉద్యోగి సురేష్ గాయాలపాలయ్యారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

తిలక్‌రోడ్డులో ట్రాఫిక్ కష్టాలు

వరంగల్: నగరంలోని కాశిబుగ్గ తిలక్‌రోడ్డులో సాయంత్రం అయిందంటే ట్రాఫిక్ ఇబ్బందులు మొదలవుతున్నాయి. ఈ రోడ్డులో ఒకవైపు రెండు కేక్‌షాపులు, మరో వైపు బార్‌షాపు, పక్కన వైన్స్ ఉండడంతో వాటి ముందు ఇష్టారాజ్యంగా వాహనాలు, మోటార్ సైకిళ్లను పార్కింగ్ చేస్తున్నారు. దాంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. బార్‌షాపుకు పార్కింగ్ సదుపాయం లేకపోవడంతో రోడ్డుపైనే వాహనాలను నిలిపి ఉంచుతున్నారు. కేక్ షాపులకు వచ్చే వినియోగదారులు సైతం రోడ్డుపైనే వాహనాలను పార్కింగ్ చేయడంతో రహదారి ఇరుకుగా మారుతోంది. అధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.



రద్దీగా ఉన్న కాశిబుగ్గలోని తిలక్‌రోడ్డు

వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న వినయ్‌భాస్కర్

హన్మకొండ అర్బన్: వేసవిలో అధిక ఉష్ణోగ్రతల దృష్ట్యా విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ సూచించారు. వడ్డెపల్లిలోని పింగిళి కళాశాల హాస్టల్‌ను బుధవారం తనిఖీ చేశారు. హాస్టల్‌లో వసతులు, విద్యాబోధన తదితర అంశాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసి, వైద్య పరీక్షలు చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ చంద్రమౌళి, వైస్ ప్రిన్సిపల్ సుహాసిని రామకృష్ణారెడ్డి, రేణుక, పార్వతి, శిరీష తదితరులు ఉన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సాధనకు పోరాడాలి



సమావేశమైన జిల్లా కార్యవర్గ సభ్యులు

నయీంనగర్: జిల్లాలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సాధనకు దశలవారీగా పోరాటాలు నిర్వహించాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా కమిటీ నిర్ణయించింది. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం బుధవారం జరిగింది. యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గడ్డం రాజిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీనియర్ నాయకులు దాసరి కృష్ణారెడ్డి మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా జర్నలిస్టులు ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వానికి విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు ఇళ్ల స్థలాల సాధనకు దశలవారీగా పోరాటాలే మార్గమని సూచించారు. రాష్ట్ర కార్యదర్శి గాడిపెల్లి మధు మాట్లాడుతూ ఈనెల 24న నిర్వహించనున్న వరంగల్ ప్రెస్‌క్లబ్ అభినందన సభను విజయవంతం చేయాలని కోరారు. తొలుత జిల్లా ప్రధాన కార్యదర్శి తోట సుధాకర్ ఇప్పటి వరకు నిర్వహించిన కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వల్లాల వెంకటరమణ, గుంటి విద్యాసాగర్, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వేముల నాగరాజు, బొల్లారపు సదయ్య, మాజీ అధ్యక్షులు పీవీ మదన్‌మోహన్, పిన్నా శివకుమార్, గడ్డం కేశవమూర్తి, నాయకులు కంకనాల సంతోష్, సంగోజు రవి, సాయిరాం పాల్గొన్నారు.

తపాలా బ్యాంక్ ప్రమాద బీమాతో అనేక ప్రయోజనాలు

హన్మకొండ: ఇండియన్ పోస్ట్ పేమెంట్ బ్యాంకు ప్రమాద బీమా ద్వారా అనేక ప్రయోజనాలున్నాయని పోస్టల్ హనుమకొండ డివిజన్ సూపరిండెంట్ బానోత్ నందా తెలిపారు. ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంక్ టాటా ఏఐజీ ప్రమాద బీమా పాలసీని అమలు చేస్తోందని, ప్రజలు ఈ పాలసీలో చేరి ప్రయోజనాలు పొందాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు. రూ.299 ప్రీమియం చెల్లించి ఈ బీమా చేయించుకోవాలని తెలిపారు. 18 నుంచి 65 సంవత్సరాల వయస్సు కలిగిన వారు అర్హులని వివరించారు. యాక్సిడెంట్ డెత్ కవరేజీ రూ.10 లక్షలు, శాశ్వత పూర్తి వైకల్యం కలిగితే రూ.10 లక్షలు, ప్రమాదవశాత్తు విచ్ఛేదనం, పక్షవాతం ఏర్పడితే రూ.10 లక్షలు, ఇన్ పేషంట్ వైద్య ఖర్చులు రూ.60 వేలు, లేదా ఆస్పత్రిలో అసలు ఖర్చు (ఏది తక్కువైతే అది), అవుట్ పేషంట్ వైద్య ఖర్చులు రూ.30 వేలు లేదా అసలు ఖర్చు (ఏది తక్కువైతే అది), హాస్పిటల్ రోజువారి ఖర్చు రూ.వేయి చొప్పున 10 రోజులకు చెల్లిస్తారు. కుటుంబ రవాణా ఖర్చు రూ.25 వేల వరకు చెల్లిస్తారు. ఇప్పటి వరకు, హైదరాబాద్ రీజియన్ పరిధిలో తపాలా శాఖ ఇండియన్ పోస్ట్ పేమెంట్ బ్యాంక్ యాక్సిడెంట్ పాలసీకి చెందిన 27 క్లెయిమ్‌లకు సంబంధించిన పాలసీదారులు / నామినీలు లబ్ధి పొందారని తెలిపారు. 4 యాక్సిడెంట్ క్లెయిమ్‌లకు రూ.40 లక్షలు, వైద్య ఖర్చులకు 7,86,657లు చెల్లించినట్లు వివరించారు.

అప్రమత్తంగా ఉంటే చోరీలకు చెక్

వరంగల్ క్రైం: అప్రమత్తంగా ఉంటే చోరీలను నియంత్రించవచ్చని వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్ సూచించారు. ఈమేరకు నగర శివారు ప్రాంతాల్లోని కాలనీవాసులతో వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ చోరీల నియంత్రణలో ప్రజలు సైతం భాగస్వాములు కావాలని కోరారు. సమావేశంలో డీసీపీలు మురళీధర్, కరుణాకర్, అబ్దుల్‌బారీ, ఏసీపీలు శ్రీనివాస్, తిరుమల్, డేవిడ్ రాజ్, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా ప్రవేశాలు



కాశిబుగ్గ: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రవేశాలు చేపడుతున్న కార్పొరేట్ కళాశాలలు, పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ల్యాదల్ల శరత్ డిమాండ్ చేశారు. కాశిబుగ్గలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యాసంవత్సరం ప్రారంభం కాకముందే కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించాయని తెలిపారు. అయినా కూడా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ వారికి వంత పాడుతున్నారని విమర్శించారు. సాగర్, సూర్య, వంశీ, శ్రావణ్, శ్రీకాంత్, ప్రవీణ్ పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలు వస్తున్నాయి

కాళోజీ సెంటర్: సర్కారు బడిలో చదివే విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్‌కు దీటుగా వసతులను కల్పించడంతో పాటు నాణ్యమైన, గుణాత్మక విద్య అందించేందుకు చర్యలు చేపట్టింది. పాఠశాల పునఃప్రారంభం రోజున విద్యార్థుల చేతుల్లో ఉచిత పాఠ్యపుస్తకాలు ఉండేలా ఏర్పాట్లు చేసింది. ఈ మేరకు జిల్లాలో 757 పాఠశాలలు ఉండగా ఇందులో 50,735 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి ఉచిత పాఠ్యపుస్తకాలు 4,01,012 అవసరం ఉందని ప్రభుత్వానికి ప్రతిపాదన పంపగా ఇప్పటి వరకు జిల్లాకు 1,69,810 చేరుకున్నాయి. ఇంకా 2,31,202 పుస్తకాలు రావాల్సి ఉంది. ఇతర గురుకుల పాఠశాలలు 18, కేజీబీవీ 6, టీఎస్ ఎంఎస్ 6 కలుపుకొని మొత్తం 757 పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో నమోదైన 50,735 విద్యార్థులకు పుస్తకాలు అందనున్నాయి.

కొనసాగుతున్న కాంట్రాక్ట్ అధ్యాపకుల ధర్నా

కేయూ క్యాంపస్: తెలంగాణ యూనివర్సిటీల్లోని కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజేషన్ చేయాలని కాకతీయ యూనివర్సిటీ అధ్యాపకుల సంఘం (కుక్టా) ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా కొనసాగుతోంది. ఈమేరకు కాకతీయ యూనివర్సిటీ పరిపాలన భవనం వద్ద బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా కుక్టా అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోథ్ మాట్లాడుతూ యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకుల రెగ్యులరైజేషన్‌కు సంబంధించిన పూర్తి వివరాలను 2015వ సంవత్సరంలో సర్క్యులర్ రూపంలో తీసుకున్నారని, ఇప్పటివరకు క్రమబద్ధీకరించలేదని వాపోయారు. రాష్ట్రవ్యాపితంగా 12 యూనివర్సిటీల్లో కాంట్రాక్ట్ అధ్యాపకులుగా పనిచేస్తున్న 1335 మందిని రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. జనరల్ సెక్రటరీ ఆర్‌డీ.ప్రసాద్, బాధ్యులు నాగయ్య, మధుకర్‌రావు, వెంకటగోపీనాథ్, గడ్డం కృష్ణ, కవిత, కల్పన, సంగీత్‌కుమార్, శశిధర్, చీకటి శ్రీనివాస్, శ్రీధర్‌రావు, చంద్రశేఖర్, చాడ స్వామి, చందులాల్, ప్రియాంక, నర్సింహరావు, జిత్య, రవికుమార్, సురేష్, దామోదర్ పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు

ఎర్రబెల్లి స్వర్ణకు అభినందనల వెల్లువ



స్వర్ణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రాజభద్రయ్య

హన్మకొండ చౌరస్తా: వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షురాలిగా మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణను నియమించడంపై కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హనుమకొండలోని స్వగృహంలో ఆమెను బుధవారం కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. అభినందనలు తెలిపిన వారిలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండెల రాజభద్రయ్య, పశ్చిమ యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడు కొడిపాక గణేష్, నాయకులు రాజ్‌కుమార్, ఆశం కల్యాన్, చందుపట్ల ధన్‌రాజ్, మల్లం కుమార్, అంకేశ్వరపు సురేందర్, దండ్రే రమేష్, కందుకూరి రజినీకాంత్, భూపాల్‌రెడ్డి, అలెగ్జాండర్, కిరణ్‌సాయి, దేవేందర్, వెంకటయ్య ఉన్నారు.



స్వర్ణ దంపతులను సన్మానిస్తున్న తూర్పు నేతలు

స్వర్ణను కలిసిన తూర్పు కాంగ్రెస్ నేతలు

వరంగల్: వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షురాలిగా నియమితులైన మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణను తూర్పు నియోజకవర్గంలోని కాంగ్రెస్ నేతలు హనుమకొండలోని ఆమె స్వగృహంలో బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్వర్ణకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి ఎర్రబెల్లి వరదరాజేశ్వర్‌రావు, మహ్మద్ అయూబ్, జన్ను రవి, గొల్లన రవి, కొదాటి అనిల్‌కుమార్, జన్ను ఆదాం, గిన్నారం రాజు, జన్ను జీవన్, వేణు, మహమూద్, సాబీర్, ఎస్‌కే.పాషా, దినేషా, యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మహిళా హక్కులకు రక్షణ కల్పించాలి



మాట్లాడుతున్న చల్లా శ్రీనివాస్

కాజీపేట అర్బన్: మహిళా హక్కులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ చల్లా శ్రీనివాస్ కోరారు. హనుమకొండ హంటర్‌రోడ్డులోని న్యూశాయంపేటలో ఏఐఎఫ్‌డీడబ్ల్యూ ఆధ్వర్యంలో సమత ఎడ్యుకేషనల్ సొసైటీ ఆవరణలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి రాజకీయ విజ్ఞాన తరగతులకు బుధవారం ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. 18వ శతాబ్దంలో ఏర్పాటు చేసిన మహిళా చట్టాలే నేటికీ చలామణి అవుతున్నాయని, కాలానుగుణంగా రూపొందించిన మహిళా చట్టాలు అమలుకు నోచుకోవడం లేదని అన్నారు. బాల్య వివాహాలు, శిశు విక్రయాలు, లైంగిక వేధింపులు కొనసాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. చట్టాలను కఠినంగా అమలు చేసి మహిళలకు న్యాయం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌డీడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సైదమ్మ, సుకన్య, జ్యోతి, పుష్ప, రాగసుధ, సంధ్య, విమల పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తనిఖీలు



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారి జ్యోతి

మామునూరు: ఖిలా వరంగల్ మండలం పరిధిలో బొల్లికుంట, వసంతాపూర్ గ్రామాల్లో వినాయక మాక్స్ సొసైటీ, ఇతర సంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రెవెన్యూ, పోలీస్, కోఆపరేటివ్ అధికారులు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధాన్యాన్ని అధికారులు పరిశీలించారు. తరుగు పేరుతో రైతులను దోపిడీ చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇబ్బందులు ఎదురైతే ఫిర్యాదు చేయాలని రైతులకు సూచించారు. మండల సొసైటీ వైస్ చైర్మన్ సోల్తీ భూమాత, ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్, నోడల్ ఆఫీసర్ జ్యోతి, ఎస్సై కృష్ణవేణి, రాజేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ సిబ్బందికి వేతనాలు పెంచాలి

కాశిబుగ్గ: ఈఎస్ఐ ఆస్పత్రి, డిస్పెన్సరీలలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బందికి వేతనాలు పెంచాలని తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు లేబర్‌కాలనీలోని ఈఎస్ఐ ఆస్పత్రి ప్రధాన గేటు వద్ద సిబ్బందితో కలిసి బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ప్రస్తుతం ఈఎస్ఐలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ నర్సింగ్ సిబ్బందికి రూ.22,750 మాత్రమే చెల్లిస్తున్నారని వాపోయారు. అలాగే, 23 సెలవులు మాత్రమే ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధర్నాలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి ఉప్పుల రవి, నజీర్, బాలరాజ్, జాంగీర్, రేవతి, సౌమ్య, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న నాయకులు, వైద్య సిబ్బంది

సీఎం కప్‌ను కైవసం చేసుకోవాలి

హసన్‌పర్తి: రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో అద్భుతమైన ప్రదర్శన కనబరిచి హనుమకొండ జిల్లా స్థాయిలో సీఎం కప్‌ను కైవసం చేసుకోవాలని ఎంపీపీ కేతపాక సునీత సూచించారు. హసన్‌పర్తిలోని జిల్లా పరిషత్ పాఠశాలలో మూడు రోజుల పాటు నిర్వహించిన సీఎం కప్ మండలస్థాయి క్రీడాపోటీలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అద్భుతమైన ప్రదర్శనతో జిల్లా స్థాయిలో కూడా రాణించాలని పిలుపునిచ్చారు. అనంతరం విజేతలకు సర్టిఫికెట్లు, మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు రేణుకుంట్ల సునీత, తహసీల్దార్ నాగేశ్వర్‌రావు, ఎంపీడీఓ రామకృష్ణ, ఎంఈఓ రాంకిషన్‌రాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు వీసం సురేందర్‌రెడ్డి, చకిలం రాజేశ్వర్‌రావు, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అమితారెడ్డి, సర్పంచ్‌లు పెద్ది తిరుపతమ్మ, అరుణ్, మాజీ ఉపసర్పంచ్ తగరం చిరంజీవి, ఏపీఓ విజయలక్ష్మి పాల్గొన్నారు.



విజేతలకు షీల్డ్ అందజేస్తున్న ఎంపీపీ సునీత

మార్కెట్‌ను సందర్శించిన తమిళనాడు అధికారులు



సమావేశమైన తమిళనాడు మార్కెటింగ్ అధికారులు

వరంగల్: ఏనుమాములలోని వరంగల్ వ్యవసాయ మార్కెట్‌ను తమిళనాడు రాష్ట్ర మార్కెటింగ్ శాఖ అధికారులు బుధవారం సందర్శించి పరిశీలించారు. మధురై, కడలూర్ మార్కెట్ కమిటీ కార్యదర్శులు ఎస్.మెర్సి జయరాణి, ఎస్.విజయ, ఇంజనీరింగ్ సూపర్‌వైజర్ టి.ప్రేమ్‌సాగర్, ఏఓ టి.సేతురామ్‌లతో కూడిన బృందం మార్కెట్‌లోని యార్డులు, గాల్వల్యూమ్ కవర్ షెడ్డు నిర్మాణాలు, కోల్డ్‌స్టోరేజీలను సందర్శించి పరిశీలించారు. అనంతరం మార్కెట్ పరిపాలన భవనంలోని చైర్‌పర్సన్ దిడ్డి భాగ్యలక్ష్మి చాంబర్‌లో అంతర్రాష్ట్ర క్రయ విక్రయాలపై మార్కెటింగ్ అధికారులతో చర్చించారు. సమావేశంలో జేడీఎం ఈ. మల్లేశం, డీడీఎం అజ్మీర రాజు, డీఎంఓ పి.ప్రసాద్‌రావు, మార్కెట్ ఎస్‌జీఎస్ బీవీ.రాహుల్, చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షులు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, రాజు కరాణీ, మార్కెట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



సీఆర్‌పీఎఫ్ ర్యాలీని ప్రారంభిస్తున్న అతిథులు

హసన్‌పర్తి: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పర్యావరణ రక్షణ, పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని సీఆర్‌పీఎఫ్ 58 కమాండెంట్ విద్యాధర్ అన్నారు. నగరంలోని పలివేల్పుల రోడ్డులోని బెటాలియన్ ఆధ్వర్యంలో పర్యావరణ రక్షణ, పరిసరాల పరిశుభ్రతపై బుధవారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యావరణవేత్త డాక్టర్ రతన్‌సింగ్‌తో కలిసి ర్యాలీని ప్రారంభించి విద్యాధర్ మాట్లాడారు. సీఆర్‌పీఎఫ్ క్యాంప్ నుంచి ప్రారంభమైన సైకిల్ ర్యాలీ.. దుర్గానగర్, సాయిగణేష్‌కాలనీ, విద్యారణ్యపురి కాలనీ వరకు సాగింది. కార్యక్రమంలో రెండవ కమాండెంట్లు మణి జి.నాయర్, సుందర్ కుమార్, డిప్యూటీ కమాండెంట్లు సుమ, తులసి, అసిస్టెంట్ కమాండెంట్ దాసరి లక్ష్మి, ఇంటర్నేషనల్ సైకిల్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జిల్లా దేశిని లక్ష్మీనారాయణ, కార్యదర్శి నన్నుసాహెబ్, ట్రై సిటీస్ సైకిల్ రైడర్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

21న వెలమ సంక్షేమ సంఘం వార్షికోత్సవం

కాజీపేట అర్బన్: హనుమకొండ హంటర్‌రోడ్డులోని వెలమ సంక్షేమ సంఘం భవనంలో ఈనెల 21వ తేదీన ఉమ్మడి వరంగల్ జిల్లా వెలమ సంక్షేమ సంఘం 28వ వార్షిక సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పేరాల మధుసూదన్‌రావు, కాకులమర్రి ప్రవీణ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ముఖ్యఅతిథులుగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్, ఎమ్మెల్సీ రవీందర్‌రావు హాజరు కానున్నట్లు తెలిపారు. వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వేగవంతంగా పూర్తి చేయాలి

వరంగల్ అర్బన్: మురుగు కాలువల నిర్మాణ పనుల్లో వేగం పెంచి వర్షాకాలం ప్రారంభం కాకముందే పూర్తి చేయాలని నగర మేయర్ గుండు సుధారాణి ఆదేశించారు. బల్దియా పరిధిలోని 29వ డివిజన్ పోతన నగర్ రోడ్డులో నిర్మిస్తున్న డ్రైన్ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరదనీరు నిలవకుండా సులువుగా వెళ్లేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు.



పనులను పరిశీలిస్తున్న మేయర్